# క్రొత్త నిబంధన -
# నూతన ఆరాధన

> అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించు వారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు **ఆత్మ** గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను (యోహాను 4:23, 24).

ధర్మశాస్త్రంలో దేవునికి ఆరాధన జంతువుల బలుల చుట్టు కట్టబడింది. అయితే నూతన చట్టం ఆత్మసంబంధమైన బలులపైన కట్టబడింది. క్రీస్తు నియమం క్రింద, మనలను మనమే సమర్పించుకోవాలి, మనకు మనమే బలి చేసికోవాలి (రోమా 6:4-6; గలతీ. 2:20), మనం సజీవ యాగంగా నిలిచియుండాలి (రోమా 12:1). మన ఆరాధన అక్షరానుసారమైన ప్రాచీన స్థితికి సంబంధించింది కాక, ఆత్మానుసారమైన సవీన స్థితికి సంబంధించిందై యుండాలి (2 కొరింథీ. 3:6; ఫిలిప్పీ. 3:3), తత్ ఫలితంగా ఆత్మ సంబంధమైన బలులు అర్పింపబడాలి. పేతురు యిలా అన్నాడు:

> మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవమునైన రాయియగు ప్రభువునొద్దకు వచ్చినవారై, యేసు క్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు (1 పేతురు 2:4, 5).

ఈ స్తుతి యాగము మానవ అంతరంగపు ఆత్మలోనుండి మానవ పెదవుల ద్వారా వ్యక్తపరచబడవలసి ఉంది. “కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము” (హెబ్రీ. 13:15).

### వ్యత్యాసమైన బలి

పాపము, దోషము అనేవాటి (లేవీయ. 4:1-35; 5:1-19) పరిహారము కొరకు ధర్మశాస్త్రములో జంతు బలులు మాత్రమే ఉపయోగింపబడలేదు. ఆరాధనకు సంబంధించిన సమాధానార్థమైన బలులు, స్వేచ్ఛార్పణలు, కృతజ్ఞతార్పణలు వగైరాలు కూడా ప్రస్తావించబడ్డాయి (లేవీయ. 3:1-9; 7:11-34). “వాడు కృతజ్ఞతార్పణముగా దాని నర్పించినప్పుడు తన కృతజ్ఞతార్పణ రూపమైన బలిగాక నూనెతో కలిసినవియు

పొంగనివియునైన పిండి వంటలను ... అర్పింపవలెను" (లేవీయ. 7:12). ఆయనకు కేవలం ఈ బలులను మాత్రమే గాక, పవిత్రమైన జీవితాలు విరిగిన హృదయాలు వారికి అవసరమైయున్నాయి (కీర్తన. 51:17; యెషయా 1:11-17).

నిబంధన మందసము యెరూషలేమునకు తరలింపబడినప్పుడు, మందసము మోయు వారు ఆరేసి యడుగులు సాగగ ఎద్దు ఒకటియు, క్రొవ్విన దూడ ఒకటియు వధింప బడునట్లు దావీదు ఆరాధించాడు (2 సమూ. 6:13). మందసము ప్రత్యక్ష గుడారాన్ని సమీపించినప్పుడు, "దావీదు దహనబలులను సమాధానబలులను యెహోవా సన్నిధిని అర్పించెను" (2 సమూ. 6:17).

పాత నిబంధన కాలంలో నాట్యములను, వాయిద్యములను దేవుని ఆరాధనలో వాడబడినందున, నేటి ఆరాధనలో వాటిని కొందరు సమర్థిస్తున్నారు (కీర్తన. 150:4-6). వారి వాదం యిలా నడుస్తుంది: "అప్పుడు అవి ఆయనకు ఆరాధనగా అంగీకారమై యున్నప్పుడు, నేడు ఆయన వాటిని ఎందుకు అంగీకరించడు?" దహనబలుల విషయంలో కూడా అదే ప్రశ్నను అడుగవచ్చు. ఆరాధన యొక్క రూపంగా అప్పుడు వీటిని దేవుడు ఆజ్ఞాపించాడు, గనుక యిప్పుడు ఆయన వాటిని ఎందుకు అంగీకరింపడు?

దానికి కొన్ని సార్లు యివ్వబడే జవాబు ఏమంటే - ప్రభువైన యేసు తన బలిని సమర్పించినందున, యికమీదట బలులు అంగీకరింపబడవని దేవుడు ప్రత్యేకించి తెలియజేశాడు. పాపపరిహారార్థ బలులు యికను చెల్లవు ఎందుకంటె క్రీస్తు పాపముల కొరకై ఒకే బలిని సమర్పించాడు అని బైబిలు చెప్పుతోంది (హెబ్రీ. 7:27; 9:24-28; 10:4, 8, 12, 14), అయితే దహనబలులు ఆరాధనలో ప్రక్కన పెట్టబడ్డాయని ఎక్కడ చెప్పబడింది? ఇవి ధర్మశాస్త్రం యివ్వక ముందు అంగీకరించబడ్డాయి (ఆది. 4:4; 8:20; 22:13; 31:54; 46:1; నిర్గమ. 18:12). మరియు ధర్మశాస్త్రం ఆచరింపబడిన కాలంలో సయితము అంగీకరించబడ్డాయి. అవి క్రొత్త నిబంధన ఆరాధనలో ఎక్కడా ఆజ్ఞాపింపబడని వాస్తవాన్ని బట్టి, వాటిని ఆరాధనలో చేర్చకూడదు. దహనబలులను లేకుండ చేసే సూత్రమే, క్రొత్త నిబంధనలో చేర్చబడని ధర్మశాస్త్ర చట్ట రూపమైన యితర ఆరాధనలను తొలిగిస్తుంది. ధర్మశాస్త్రము రద్దు చేయబడిందని బోధించే కొన్ని లేఖన భాగాలను తరువాత పాఠంలో మనం ఆలోచన చేద్దాం

## వేరైన యాజకత్వం

భూ సంబంధమైన యాజకుని ద్వారా దేవుని ఆరాధించడానికి బదులు, క్రైస్తవులే దేవుని యాజకులైయున్నారు[1] (1 పేతురు 2:9; ప్రకటన 1:6; 5:10; 20:6). ఒకే ఒక మధ్యవర్తియైయున్న క్రీస్తు యేసు ద్వారా మనం దేవుని ఆరాధించుతాం (1 తిమోతి 2:5).

హెబ్రీ. 7:12 యాజకత్వం మార్చబడినట్టు మాట్లాడుతుంది. పాత నిబంధన కాలంలో లేవీ గోత్రికులు మాత్రమే యాజకులుగా నియమింపబడ్డారు (ద్వితీయో. 21:5), నేడైతే క్రైస్తవులు దేవునియెదుట యాజకులుగా సేవ చేస్తున్నారు (1 పేతురు 2:5, 9); ప్రభువైన

క్రీస్తు వారికి ప్రధాన యాజకుడుగా ఉన్నాడు (హెబ్రీ. 2:17; 4:14, 15; 5:5, 10).

> పవిత్రుడును, నిర్దోషియు, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును, ఆకాశ మండలముకంటె మిక్కిలి హెచ్చయినవాడునైన యిట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయినవాడు. ధర్మశాస్త్రము బలహీనతగల మనుష్యులను యాజకులనుగా నియమించును గాని ధర్మశాస్త్రమునకు తరువాత వచ్చిన ప్రమాణ పూర్వకమైన వాక్యము నిరంతరమును సంపూర్ణ సిద్ధిపొందిన కుమారుని నియమించెను గనుక, ఈయన ఆ ప్రధానయాజకులవలె మొదట తన సొంత పాపముల కొరకు తరువాత ప్రజల పాపములకొరకును దినదినము బలులను అర్పింపవలసిన అవసరము గలవాడు కాదు; తన్ను తాను అర్పించు కొన్నప్పుడు ఒక్కసారే యీ పని చేసి ముగించెను (హెబ్రీ. 7:26-28).

## వేరైన మార్గం

### ఏ స్థలములోనైనా

యెరూషలేముకును అక్కడ జరిగించె మత పరమైన కార్యకలాపాలకును ఆరాధన పరిమితి కాదని ప్రభువైన యేసు బోధించాడు. ఆరాధన ఆత్మతోను సత్యముతోను జరగాలని ఆయన తెలియజేశాడు (యోహాను 4:23, 24). దేవుని ఆరాధించడంలో ఒక నూతన దినం ఉదయిస్తుందని ప్రభువు యొక్క సందేశమైయుంది. ధర్మశాస్త్రము, యెరూషలేము, అక్కడ జరుగబడే ఛాయా రూపమైన ఆరాధనకు బదులు (హెబ్రీ. 8:5), క్రీస్తు ద్వారా బయలుపరచబడే సత్యముననుసరించిన ఆరాధన దేవునికి అంగీకారమైయుంటుంది (యోహాను 1:17). ఇశ్రాయేలీయులకు ఆయన దయచేసిన ఆరాధనా పద్ధతులను ఆయన యిక మీదట అంగీకరించబోయేది లేదు.

### ఆత్మతో

ధర్మశాస్త్రం క్రింద హృదయము నొక్కి చెప్పబడకపోయినా, ఆరాధన హృదయపూర్వక మైనదైన మానవ ఆత్మ యొక్క లోతైన భావంలోనుండి కలగాలని దేవుడు ఎల్లవేళలా కోరాడు. క్రొత్త నిబంధన ఆరాధకులు ఆత్మతోను సత్యముతోను ఆరాధించేవారై ఉండాలి. ఎందుకంటే తన్ను ఆరాధించేవారు అట్టివారే అయ్యుండాలని తండ్రి కోరుతున్నాడు (యోహాను 4:23, 24). "వలెను" అనే పదం క్రీస్తు ప్రభువు ఉపయోగించిన వాస్తవం వేరుగా కోరుకోగలిగింది యికను ఏమీ లేదనే సంగతిని సూచిస్తుంది. ఆరాధన అంతా ఈ ప్రమాణంలోనే ఉండి తీరాలి.

ఆత్మతో ఆరాధన అనేది మానవ ఆత్మతో ఆరంభమై దానిని వ్యక్తపరచేదై యుండాలి. దేవునికి సమర్పించే ఆరాధన అంతరంగ పురుషునిలోనుండి యిష్టపూర్వకంగా వ్యక్తపరచే ప్రయాస కాకపోతే, ఆరాధనలో జరిగించే కార్యాలు వట్టివై దేవునికి అంగీకారం కానివై ఉంటాయి. బహిరంగమైన భౌతిక కార్యాలయందు ఆయనకు మనస్సు ఉండదు. ఆరాధన ఆత్మలోనుండియు, హృదయములోనుండియు పొర్లి వచ్చేదై ఉండాలి (ఎఫెసీ. 5:19).

### సత్యముతో

ఆరాధన కేవలం ఆత్మతో ఉండడం మాత్రమే కాదు, అది సత్యముతోను అయ్యుండాలి. సత్యము క్రీస్తు యేసువారి ద్వారా కలిగింది (యోహాను 1:14, 17; 8:31, 32; 14:6; ఎఫెసీ. 4:21). సత్యము తండ్రివలన కలిగింది (యోహాను 17:17; యోహాను 12:49, 50 చూడు). ప్రభువైన యేసువలన వినిన సత్యాన్ని పరిశుద్ధాత్మ అపొస్తలులకు జ్ఞాపకం చేస్తాడు (యోహాను 14:26); మరియు ఆయన వారిని సర్వ సత్యంలోనికి నడిపిస్తాడు (యోహాను 16:13). ఇప్పుడు మనం క్రీస్తునందు సంపూర్ణులమై ఉన్నాం (కొలస్సీ. 2:10), బుద్ధి జ్ఞానముల సర్వ సంపదలు ఆయనయందు గుప్తమై యున్నాయి (కొలస్సీ. 2:3). ఇందునుబట్టి, దేవుని ఆరాధించడంలో ఉపయోగింపబడే మానవ పారంపర్యాలు పనికిమాలినవిగా ఉంటాయి (మత్తయి 15:7-9; మార్కు 7:6-13; కొలస్సీ. 2:8; తీతు 1:14).

క్రొత్త నిబంధన ఆరాధనలో - అపొస్తలులు బోధయందును, ప్రార్థనయందును (అపో. 2:42) ప్రభురాత్రి భోజనమందు ప్రభువును జ్ఞాపకం చేసికొనుటయందును (1 కొరింథీ. 11:23-26), హృదయములో ప్రభువును గూర్చి పాడుతూ గానం చేయుటయందును (ఎఫెసీ. 5:19; కొలస్సీ. 3:16), మన హృదయంలో నిశ్చయించుకొన్న ప్రకారం యిచ్చుటయందును (2 కొరింథీ. 9:7) కొనసాగేలా చేర్చబడ్డాయి. దేవుని ఆరాధించడంలో ఆత్మ వీటిని అనుసరించకపోతే, ఆరాధనా మార్గాలుగా అవి దేవునికి అంగీకారమైనవి కాక నిష్ప్రయోజనమైనవై ఉంటాయి.

### పదియవ భాగం కాని

ధర్మశాస్త్రం క్రింద ఒకని కానుక పదియవ వంతు, ఒకడు వృద్ధిపొందిన ప్రతిదానిలో నుండి పదియవ వంతు ఇవ్వాలి. ఇది స్వేచ్ఛార్పణగా గాక, బాధ్యతగా జనులు దానిని యిచ్చుకోవాలి. లేవీయ గోత్ర పోషణ కొరకు పదియవ భాగం యివ్వబడింది.

> ఇదిగో లేవీయులు చేయు సేవకు, అనగా ప్రత్యక్షపు గుడారముయొక్క సేవకు నేను ఇశ్రాయేలీయులయొక్క దశమభాగములన్నిటిని వారికి స్వాస్థ్యముగా ఇచ్చితిని ... అయితే లేవీయులు ప్రత్యక్షపు గుడారముయొక్క సేవ చేసి, వారి సేవలోని దోషములకు తామే ఉత్తరవాదులై యుందురు. ఇశ్రాయేలీయుల మధ్యను వారికి స్వాస్థ్యమేమియు ఉండదు ... అయితే ఇశ్రాయేలీయులు యెహోవాకు ప్రతిష్ఠార్పణముగా అర్పించు దశమభాగములను నేను లేవీయులకు స్వాస్థ్యముగా ఇచ్చితిని. అందుచేతను "వారు ఇశ్రాయేలీయుల మధ్యను స్వాస్థ్యము సంపాదింపకూడదని వారితో చెప్పితిని (సంఖ్యా. 18:21, 24).

భూమి పంపిణీ చేయబడినప్పుడు, లేవీయులకు భూమిలో స్వాస్థ్య భాగము యివ్వ బడలేదు (సంఖ్యా. 18:20). అందువలన, ఈ దశమ భాగాలు కాక వేరే జీవనాధారం యివ్వబడనట్టుంది. లేవీయుల జీవనోపాధి నిమిత్తం ఇశ్రాయేలీయులలోనుండి ఈ దశమ భాగాలు పుచ్చుకొనబడతాయి (సంఖ్యా. 18:26).

ధర్మశాస్త్రం యివ్వబడక పూర్వం, షాలేము రాజును యాజకుడైన మెల్కీసెదెకునకు అబ్రాహాము దశమ భాగమిచ్చాడు (ఆది. 14:20). దేవుడు తన్ను ఆశీర్వదించిన యావత్తులోనుండి దశమ భాగం యిస్తానని యాకోబు దేవునికి మాట యిచ్చాడు (ఆది. 28:20–22). ఆ మనుష్యులు పదియవ వంతు చెల్లించినా, ధర్మశాస్త్రం దాన్ని విధిగా నిర్ణయించినా, క్రొత్త నిబంధన మాత్రం పదియవ వంతుకు మనలను పరిమితి చేయలేదు. నేడు మనం వర్ధిల్లిన కొలది దేవునికి యివ్వవలసినవారమై యున్నాం (1 కొరింథీ. 16:2). మనం సంతోషంగాను, మన హృదయాల్లో నిశ్చయించుకున్న ప్రకారం యివ్వ వలసినవారమైయున్నాం (2 కొరింథీ. 9:7).

## ముగింపు

దేవుడు ధర్మశాస్త్రమందు ఇశ్రాయేలీయులకు యిచ్చిన కట్టడలవంటివే క్రొత్త నిబంధనలో ఆయన యివ్వలేదు. దేవుడు మనకు బాధ్యతలను అప్పగించినవాడే తప్ప, ఎంత ఎక్కువ లేక ఎంత తక్కువ చేయాలనేది ఆయన మనకు తెలుపలేదు. ఎంత శ్రేష్ఠంగా ఆయనను మనం సేవించగలమో దాన్ని మన హృదయాల్లో మనమే తీర్మానించు కోవాలి. మనం కొంచెముగా సేవ చేశామంటే, మనలను మనమే పరిమితి చేసికొన్నాం. మనం అధికంగా సేవ చేశామంటే, దేవునికి గొప్పగా సేవ చేయడానికి మనలను మనమే అప్పగించుకొన్నామన్న మాట. ఏమి చేయడానికి ఉద్దేశాన్ని మన హృదయాలు కలిగిస్తాయో దాని ఆధారం మీద (1 కొరింథీ. 4:5), మనం తీర్పు తీర్చబడతాం (రోమా 2:6; 2 కొరింథీ. 5:10; 1 పేతురు 1:17). దేవుడు మన హృదయాలను పరిశీలించుతాడు (1 థెస్స. 2:4), మరియు మన పనులనుబట్టి ఆయన తీర్పు తీర్చుతాడు (రోమా 2:6; 1 పేతురు 1:17).

మన కార్యాలకు ఆయన ప్రమాణాలను నియమించినట్టు అపొ. 15:29లో స్పష్టమౌతుంది. ఏదియెలాగున్నా, మనం ఎంత యిస్తాం, పాడతాం, ప్రార్థిస్తాం, పఠిస్తాం, అవసరతలో ఉన్నవారికి సహాయం చేస్తాం అనేవి వచ్చినప్పుడు మన హృదయాలు – దేవుని వాక్యముచే నడిపించబడినవై – మనలను పాలిస్తూ ఉండాలి. ధర్మశాస్త్రంలో అనుమతించని స్వాతంత్ర్యం నేడు మనకు ఉంది.

---

సూచనలు

[1]"క్రొత్త నిబంధన సంఘానికి యాజకులున్నారా?" అనే పాఠాన్ని "క్రొత్త నిబంధన సంఘమును గూర్చిన ప్రశ్నలు" అనే ట్రూత్ ఫర్ టుడే, పేజీ 50లో చూడు.